ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 23 డిసెంబరు 2024

పాఠశాలలో...

పనికిమాలిన పనులు

తాటిచెర్ల జడ్పీహెచ్ఎస్‌లో వెలుగుచూస్తున్న వ్యవహారాలు

వారానికి ఒక్కసారైనా పార్టీ ఉండాల్సిందేనట

ఉపాధ్యాయుల పనితీరుపై గ్రామస్థుల అసహనం



తాటిచెర్ల పాఠశాల

అనంతపురంరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడి తీరుతో వివాదాస్పదంగా మారిన తాటిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో జరిగిన వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఈనెల 7న జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ తరువాత ఆ పాఠశాల వార్తల్లో నిలిచింది. అప్పటి నుంచి గతంలో జరిగిన అనేక వివాదాస్పద అంశాలు బయటకు వస్తున్నాయి. పాఠశాలను విందులకు కేంద్రంగా మార్చారన్న విమర్శలు గ్రామస్థుల నుంచి వినవస్తున్నాయి. వారానికి ఒక్కసారైనా పాఠశాలల్లో పార్టీ జరిగేదని వారు చెబుతున్నారు.

భేదాభిప్రాయాలతో విందులు బంద్

గతంలో పాఠశాలలో విందుల వ్యవహారం జోరుగా జరిగినట్లు సమాచారం. పాఠశాలలో ప్రతి వారం పార్టీ ఉండాల్సిందే అనేంతగా వ్యవహారం నడిచిందనే చర్చ సాగుతోంది. విందులో కచ్చితంగా ముక్క ఉండాల్సిందేనట. పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ కలిసి విందు నిర్వహించుకున్నట్లు తెలిసింది. ఇటీవల ఉపాధ్యాయుల మధ్య అభిప్రాయబేధాలు రావడంతో ఈ విందులు బంద్ అయినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ తరువాత ఉపాధ్యాయుల మధ్య బేదాభిప్రాయాలు మరింత ముదిరినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ పాత విషయాలను బహిర్గతం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల తీరుపై గుసగుసలు

విందుల సంగతి అలా ఉండగా పాఠశాలలోని కొందరు ఉపాధ్యాయులు పనితీరుపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు తరచూ ఆలస్యంగా వస్తున్నట్లు వారు చెబుతున్నారు. పిల్లకు పాఠాలు చెప్పడం మాని, ఎప్పుడూ సెల్‌ఫోన్‌లోనే బిజీగా ఉంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఓ ఉపాధ్యాయుడు గ్రామంలోని ప్రధాన రోడ్డు వెంబడి గంటల తరబడి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కనిపిస్తుండేవారని గ్రామస్థులు చెబుతున్నారు. మరో ఉపాధ్యాయుడు విద్యార్థులతో సక్రమంగా నడుచుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే ఆయన్ను కింది తరగతులకు మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరినట్లు తెలుస్తోంది.

మా దృష్టికి వచ్చింది

తాటిచెర్ల పాఠశాలలో సాగుతున్న విషయాలపై పూర్తిస్థాయిలో విచారణ చేశాం. కొన్ని అంశాల గురించి తెలుసుకోవడానికి శనివారం పాఠశాలకు వెళ్లాం. స్కూల్‌లో పార్టీల చేసుకుంటున్నట్లు మా దృష్టికి వచ్చింది. స్కూల్ వెళ్లినప్పుడు విద్యార్థుల విచారించగా ఇదే విషయం చెప్పారు. అన్ని అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

-శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈఓ

ఆశ... నిరాశ..!

అర్హులకు అందని విశ్వకర్మ పథకం

- ప్రారంభమై 15 మాసాలు గడిచినా ఫలితం అంతంతే
- జిల్లాలో 99,178 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు
- 32,683 దరఖాస్తులు రాష్ట్రస్థాయికి సిఫార్సు
- 10 బ్యాచుల్లో 300 మందికే శిక్షణ
- బ్యాంకు రుణాల సంగతి దేవుడికే ఎరుక!

అనంతపురం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన అమలులో జాప్యం జరుగుతోంది. పథకం ద్వారా శిక్షణతోపాటు రుణ సదుపాయం పొందడానికి దరఖాస్తు చేసుకొని ఏడాది పూర్తయినా ఆర్థిక సాయం అందలేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

టెక్నికల్ సమస్యతో ఆగిపోయిన డేటా

సాంకేతిక సమస్యలతో విశ్వకర్మ పోర్టల్‌లో 11724 మంది లబ్ధిదారుల డేటా ఆగిపోయినట్లు సమాచారం. కామన్ సర్వీస్ సెంటర్ సిబ్బంది కొందరు లబ్ధిదారుల దరఖాస్తుల్లో జిల్లా పేరు అనంతపురం అని, మరి కొన్ని దరఖాస్తుల్లో జిల్లా పేరు అనంతపూర్ అని నమోదు చేశారు. నిబంధనల మేరకు అనంతపురం జిల్లా అని నమోదు చేయాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా రెండు రకాలుగా జిల్లా పేరు నమోదు చేయడంతో సమస్య ఏర్పడింది. దీని కారణంగా దరఖాస్తుల డేటా ఆగిపోయినట్లు సమాచారం. ఈ విషయంపై స్థానిక అధికారులు సంబంధిత రాష్ట్ర, కేంద్ర ఉన్నతాధికారులతో చర్చించినట్లు తెలిసింది. త్వరలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని పరిశ్రమల శాఖ, స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారులు పేర్కొంటున్నారు.

రాష్ట్రస్థాయికి 32,683 దరఖాస్తుల సిఫార్సు

గత ఏడాది సెప్టెంబరు 17న విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఐదేళ్లపాటు ఈ పథకం అమలులో ఉండేలా నిర్ణయించారు. ఈ పథకం ఆరంభమై 15 మాసాలు గడుస్తున్నా క్షేత్ర స్థాయిలో అమలులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 99178 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటిదాకా సచివాలయాల నుంచి 81526 దరఖాస్తులు అర్హత ఉన్నట్లు జిల్లా స్థాయికి పంపారు. 3693 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 13959 దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నాయి. జిల్లా స్థాయి నుంచి 32683 లబ్ధిదారుల దరఖాస్తులు అర్హత ఉన్నట్లు రాష్ట్ర స్థాయికి సిఫార్సు చేశారు. జిల్లా స్థాయిలో 6517 మంది లబ్ధిదారులను అనర్హులుగా తేల్చారు. మరో 42326 లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలనా క్రమంలో పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర స్థాయి నుంచి 11724 దరఖాస్తులు అర్హత ఉన్నవిగా గుర్తించి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పంపినట్లు సమాచారం. మూడు దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి.

ఒకే లాగిన్‌తో ఇన్నాళ్లు ఇక్కట్లు

సచివాలయాల నుంచి ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ లాగిన్ నుంచి రాష్ట్ర స్థాయిలో మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్ మెంట్ (ఎంఎస్‌డీఈ)కి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అక్కడి నుంచి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు డేటా వెళుతుంది. తిరిగి అక్కడి నుంచి అర్హులైన లబ్ధిదారులకు శిక్షణనిచ్చేలా జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్‌కు డేటా వస్తుంది. గత నెల మూడో వారం దాకా జిల్లా కలెక్టర్ లాగిన్ ఒకటే ఉండింది. ఒక్క లాగిన్‌తోనే గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశ్రమల శాఖ అధికారులు రాష్ట్ర స్థాయికి పంపేవారు. ఒకే లాగిన్ ఉండటంతో దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు జాప్యం జరిగినట్లు సమాచారం. ఈ విషయాన్ని పరిశ్రమల శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో గత నెల ఆఖరివారంలో మరో 4 లాగిన్స్ సదుపాయాన్ని కల్పించినట్లు సమాచారం. అయినప్పటికీ సాంకేతిక కారణాలతో ఆశించిన స్థాయిలో దరఖాస్తుల అప్‌లోడ్ కావడం లేదన్న విమర్శలున్నాయి.



టైలర్లు, తాపీమేస్త్రీల దరఖాస్తులపై విచారణ

జిల్లా వ్యాప్తంగా 99178 మంది విశ్వకర్మ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా టైలర్లు 79121 మంది దరఖాస్తు చేసుకున్నారు. తాపీమేస్త్రులు 5483, ధోబీ 5447, నాయీబ్రాహ్మణులు 1968, కార్పెంటర్లు 1463, చర్మకారులు 1360 మంది ఉన్నారు. మిగిలిన వారిలో ఇతర కులవృత్తులకు చెందిన వారు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో టైలరింగ్, తాపీమేస్త్రుల శిక్షణ, రుణ సదుపాయం కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకో వడంతో ఆయా దరఖాస్తులపై సచివాలయ సిబ్బందితో విచారణ చేయించారు. కులవృత్తిగా టైలరింగ్, తాపీ మేస్త్రీ పనులు చేస్తున్న వారిని అర్హులుగా గుర్తించాలని, మిగతా వారిని అనర్హులుగా తేల్చాలని ఆదేశాలు అందాయి. ఆ మేరకు ఈ రెండు కేటగిరిల దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేశారు. ఈ నేపథ్యంలో ఎక్కువ శాతం మంది టైలరింగ్, తాపీమేస్త్రుల శిక్షణకు దరఖాస్తు చేసుకున్న వారిని అనర్హులుగా తేల్చారు. 79121 మంది టైలరింగ్ శిక్షణ, రుణ సదుపాయం కోసం దరఖాస్తు చేసుకోగా.. సచివాలయ స్థాయి నుంచి 65017 దరఖాస్తులను జిల్లా స్థాయికి పంపారు. 3316 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలినవి పరిశీనలో ఉన్నాయి. జిల్లా స్థాయి నుంచి 19225 దరఖాస్తులను రాష్ట్ర స్థాయికి పంపారు. 5575 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. తాపీ మేస్త్రీకి 5483 దరఖాస్తులు రాగా.. సచివాలయ స్థాయి నుంచి 4590 దరఖాస్తులను జిల్లా స్థాయికి పంపారు. 102 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. జిల్లా స్థాయి నుంచి 2559 దరఖాస్తులను రాష్ట్ర స్థాయికి పంపారు. 173 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి.

300 మందికే..

విశ్వకర్మ పథకం ద్వారా 18 రకాల చేతి వృత్తుల వారికి శిక్షణనిచ్చి బ్యాంకు రుణాలు ఇప్పించాలని నిర్ణయించారు. అర్హులుగా గుర్తించిన లబ్ధిదారులకు పక్షం రోజుల దాకా శిక్షణ నిస్తారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 స్టైఫండ్ చెల్లిసారు. ఆ తర్వాత రూ.15వేలు విలువైన టూల్ కిట్‌ను ఇంటికే పంపాలని నిర్ణయించారు. అనంతరం బ్యాంక్ ద్వారా ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.లక్ష రుణాన్ని అందజేయాలని నిర్ణయించారు. ఈ రుణాన్ని 18 నెలల్లో తిరిగి చెల్లించాలి. ఇలా సక్రమంగా రుణాన్ని తిరిగి చెల్లించిన వారికి తిరిగి రెండో విడతలో రూ.2 లక్షలు రుణం ఇస్తారు. ఈ రుణాన్ని 30 నెలల్లో చెల్లించాలి. బ్యాంకులో రుణం తీసుకున్న చేతి వృత్తుల వారికి 5 శాతం వడ్డీని వర్తింపజేస్తారు. ఇలా వృత్తి అభివృద్ధి ఆధారంగా రుణాలు ఇస్తారు. సకాలంలో చెల్లిస్తే మళ్లీ పెద్ద మొత్తంలో రుణాలు అందజేయాలని నిర్ణయించారు. జిల్లాలోని జనశిక్షణా సంస్థాన్, న్యాక్, శ్రీ టెక్నాలజీస్ సంస్థలకు చేతివృత్తుల వారికి శిక్షణనిచ్చే బాధ్యతలు స్కిల్‌డెవలప్‌మెంట్ సంస్థ అధికారులు అప్పగించారు. గత అక్టోబరు నెల దాకా 10 బ్యాచ్‌ల్లో 300 మంది బార్బర్లు, చర్మకారులకు శిక్షణనిచ్చారు. ఒక్కో బ్యాచ్‌లో 30 మందికి శిక్షణనిచ్చారు. గత నెల నుంచి అర్హులైన లబ్ధిదారుల జాబితా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి అందకపోవడంతో శిక్షణలు ఆగిపోయాయి. పథకం ఆరంభమై 15 నెలలు కావస్తున్నా ఇప్పటి దాకా 10 బ్యాచుల్లో 300 మందికి మాత్రమే శిక్షణనివ్వడంతో సరిపెట్టారు. శిక్షణ తర్వాత ఎంత మందికి బ్యాంక్ రుణాలు అందజేశారన్న వివరాలపై స్పష్టత లేదు. బ్యాంక్ రుణాల మంజూరుపై ప్రత్యేక పర్యవేక్షణ పెడితేనే లబ్ధిదారులకు ఆశించిన ప్రయోజనం చేకూరుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



జనశిక్షణా సంస్థాన్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వారు (ఫైల్)

అర్హులైన వారందరికీ శిక్షణ

విశ్వకర్మ పథకానికి అర్హులైన వారందరికీ శిక్షణతోపాటు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తాం. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 99178 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా స్థాయి నుంచి 32683 మంది లబ్ధిదారుల దరఖాస్తులు అర్హత ఉన్నట్లు రాష్ట్ర స్థాయికి సిఫార్సు చేశాం. మిగతా దరఖాస్తులను పరిశీలించి, అర్హుల దరఖాస్తులను రాష్ట్ర స్థాయికి పంపుతాం. టైలరింగ్, తాపీమేస్త్రులకు శిక్షణ, రుణ సదుపాయం కోసం ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో వాటిపై సచివాలయ సిబ్బందితో విచారణ చేయించాలన్న ప్రభుత్వం ఆదేశాల మేరకు విచారణ చేయించాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ విశ్వకర్మ పథకాన్ని వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీధర్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి

ఆలయ భూమిని ఆక్రమించిన

'విశ్వ' అనుచరులు

టీడీపీ నాయకుల ఆరోపణ





మాట్లాడుతున్న టీడీపీ నాయకులు, కడప వాసులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న పత్రం

విడపనకల్లు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్దనపల్లి గ్రామానికి చెందిన దేవాలయ భూమిని వైసీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మండల టీడీపీ నాయకులు ఆరోపించారు. ఉరవకొండలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉరవకొండలోని పాండు రంగ స్వామి ఆలయం, విడపనకల్లు మండలంలోని జనార్దనపల్లిలో ఆంజనేయస్వామి, జనార్దనస్వామి, శ్రీరామస్వామి దేవాలయాలకు నివృత్తి శేషమ్మ అనే మహిళ 1935 సంవత్సరంలో సర్వే నంబరు 141లో 21.05 ఎకరాల భూమిని ఈనాముగా ఇచ్చిందన్నారు. ప్రస్తుతం శేషమ్మ కుటుంబానికి చెందిన వ్యక్తులు ఎవరూ లేరన్నారు. దీన్ని గమనించిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులు వైసీపీ పాలనలో కోట్లు విలువ చేసే ఈ భూమిని కాజేశారని వెల్లడించారు. కడప జిల్లాకు చెందిన కరూర్ సాయిప్రసాద్, కరూర్ వెంకటశేషశర్మ, కరూర్ భాను ప్రకాష్‌రావులు ఒక్కొక్కరు 7 ఎకరాలు ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పత్రాలను కూడా చూపించారు. ప్రస్తుతం ఈ భూమి ఉరవకొండ మండలం లత్తవరం గ్రామానికి చెందిన విశ్వేశ్వరరెడ్డి అనుచరుడు కురుబ గోవిందు ఆధీనంలో ఉందన్నారు. దాదాపుగా రూ. 3 కోట్లు విలువ చేసే దేవాలయ భూమిని వైసీపీ నేతల కబంధహస్తాల నుంచి విడిపించి ఆలయాలకు అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయంగా విడపనకల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు జనార్దనపల్లి సర్పంచ్ జనార్దననాయుడు, ఎన్. రామకృష్ణ, ఎం. పాండురంగా, జి.కావేటి చౌదరి, సి.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోట కట్టడాలు అద్భుతం

గుత్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుత్తి కోట కట్టడాలు అద్భుతమని స్థానిక సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి పేర్కొన్నారు. చారిత్రాత్మకమైన గుత్తి కోటను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆంగ్లేయులు, అప్పటి దత్తమండలాల కలెక్టర్ సర్‌థామస్ మన్రో సమాధులను పరిశీలించారు. అనంతరం కోట కట్టడాలను, కోటపై భాగంలో ఉన్న గుర్రపు, ఏనుగు శాలలు, చీకటి గదులు, రంగమఠం, బావులు, రాణి మహల్ తదితర కట్టడాలను పరిశీలించారు. గుత్తి కోట గైడ్ రమేష్ కోట చరిత్ర, ప్రాముఖ్యత గురించి న్యాయమూర్తికి వివరించారు. కార్యక్రమంలో గుత్తికోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ పాల్గొన్నారు.



గుత్తికోటను పరిశీలిస్తున్న న్యాయాధికారి

శిక్షణతో ఉద్యోగం సాధించండి

ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అభిలషించారు. పట్టణంలోని టెక్స్‌టైల్స్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. వెనుకపడ్డ ప్రాంతాల అభ్యర్థుల కోసం రాయదుర్గంలో ఏర్పాటు చేసిన ఉచిత డీఎస్సీ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెట్‌లో వివిధ విభాగాల్లో మంచి మార్కులు సాధించిన వారిని ఆయన అభినందించారు. శిక్షణ పూర్తి చేసుకొన్నవారికి ఉత్తమశ్రేణి మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. అందరూ ఇంటి వద్ద శ్రద్ధగా చదువుకొని ఉద్యోగం సాధించాలని కోరారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

పూత, పులుపు పోయింది

ఆవేదనలో పప్పుశనగ రైతులు

దెబ్బతీసిన తుఫాన్ ప్రభావిత వర్షాలు

ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడీ కష్టమే

కొన్ని గ్రామాల్లో పంటను తొలగించిన రైతులు

యాడికి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు పప్పుశనగ పంటపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో దిగుబడి బాగా తగ్గిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విపరీత వాతావరణ పరిస్థితుల్లో పంట ఎండిపోతుండటంతో మండలంలోని కొన్ని గ్రామాల్లో పప్పుశనగ పంట తొలగిస్తున్నారు. ఈ ఏడాది మండలవ్యాప్తంగా 2596హెక్టార్లలో పప్పుశనగ పంట సాగుచేశారు. ఎన్. కొత్తపల్లి, తిప్పారెడ్డిపల్లి, తిరుణాంపల్లి, వేములపాడు, తిమ్మాపురం, నగరూరు, భోగాలకట్ట గ్రామాల్లో పప్పుశనగ పంట ఎక్కువగా సాగు చేశారు. తుఫాన్ ప్రభావంతో ఇటీవల అడపాదడపా వర్షాలు కురిశాయి. దీంతో పంటకు ఉన్న పూత, పలుపు రెండూ పోయాయని రైతులు తెలిపారు. ఈ ప్రభావం పంట దిగుబడిపై తీవ్రంగా పడినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంచు కురవడం వలన పంట బాగా పెరగాల్సి ఉందని, అయితే వర్షాలు పడటంతో ఎండిపోతోందని రైతులు వాపోతున్నారు. ఎక్కువరోజులు ఆకాశం మేఘావృతం అయి ఉండటంతో తెగుళ్ల ఉధృతి పెరిగిందని రైతులు తెలిపారు. మందులు పిచికారీ చేసినా తెగుళ్లు అదుపులోకి రాక పంటలు ఎండిపోయాయన్నారు. లక్షలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట కళ్ల ముందే ఎండిపోవడం చూడలేక భోగాలకట్ట గ్రామంలో కొద్దిమంది రైతులు పంటను తొలగించారు.

పూత, పులుపే కీలకం

పప్పుశనగ పంట పెరగాలన్నా, పంట దిగుబడి రావాలన్నా పూత, పులుపే ప్రధానం. ఈ ఏడాది పంట పులుపు బాగా పట్టి పూతలు ఎక్కువగా వచ్చే సమయంలో తుఫాన్ దెబ్బ కొట్టింది. దీంతో పులుపు, పూత రెండు రాలిపోయాయి. పూత మరలా వస్తుంది అనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. సాధారణంగా పప్పుశనగ పంట బాగా పండితే ఎకరాకు 10నుంచి 12క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, ఈ ఏడాది రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చేది కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.20కోట్ల పెట్టుబడులు వృథా

మండలంలో 2596హెక్టార్లలో పప్పుశనగ పంట సాగుచేశారు. ఎకరా సాగుకు సేద్యం, విత్తనం, విత్తు, సాగు, ఎరువులు, పురుగు మందులు ఇలా అన్నీ కలిపి రూ.30వేల వరకు ఖర్చుచేశారు. ఈ ప్రకారంగా మండలవ్యాప్తంగా పప్పుశనగ సాగుకు రైతులు రూ.20కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారు. వాతావరణ ప్రభావంతో పంట దిగుబడి రాక పెట్టుబడులు అన్నీ అప్పులుగా మూట గట్టుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల బీమా అందించి, పప్పుశనగ రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



యాడికిలో వాతావరణ ప్రభావంతో ఎండిపోయిన పప్పుశనగ



రెండు క్వింటాళ్ల దిగుబడీ రాదు: -ఆదినారాయణ, రైతు, తిప్పారెడ్డిపల్లి

నేను ఆరు ఎకరాల్లో పప్పుశనగ పంట సాగుచేశా. పంటలో పులుపు, పూత బాగా వచ్చే సమయంలో వర్షాలు పడ్డాయి. దీంతో పూత అంతా రాలిపోయింది. మరలా పూత వస్తుంది అనుకున్నాం. ప్రతిరోజూ ఆకాశం మేఘావృతం అయి ఉండటంతో పూత రావడం లేదు. పైగా తెగుళ్ల ఉధృతి ఎక్కువైంది. రెండు క్వింటాళ్ల కన్నా ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశాలు కనపడటం లేదు. ఈ ఏడాది పప్పుశనగ రైతులు బాగా నష్టపోవాల్సి వస్తోంది.



8 ఎకరాల్లో సాగుచేశా: జగదీష్, రైతు, ఎన్. కొత్తపల్లి

ఎనిమిది ఎకరాల్లో పప్పుశనగ సాగుచేశా. ఎకరాకు రూ.30వేల దాకా పెట్టుబడి పెట్టా. వర్షాల ప్రభావంతో పంటపై పులుపు, పూత రాలిపోయింది. పైరు అంతా ఎండిపోయింది. గ్రామంలో పప్పుశనగ రైతులందరి పరిస్థితి ఇలాగే ఉంది. తుఫాన్ ప్రభావం పప్పుశనగ పంటపై తీవ్రంగా చూపింది. పెట్టుబడి కాదు కదా కనీసం కూలీల ఖర్చులు వచ్చేది కూడా కష్టమే. పప్పుశనగ సాగు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.



వానలు దెబ్బతీశాయి: రామచంద్రారెడ్డి, రైతు, వేములపాడు

నేను నాలుగు ఎకరాల్లో పప్పుశనగ పంట సాగుచేశా. పప్పుశనగ పంట దిగుబడిపై వానలు బాగా ప్రభావం చూపాయి. పంట దిగుబడికి ఎక్కువ కలిసివచ్చే పులుపు పట్టడం, పూత వచ్చే సమయంలో వానలు పడ్డాయి. పూత అంతా రాలిపోయింది. పంట దిగుబడిపై ఇది బాగా ప్రభావాన్ని చూపుతుంది. ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి.

రైతు కళ్లలో ఆనందం

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

సబ్సిడీపై డ్రిప్, స్ప్రింకర్ల పంపిణీ



డ్రిప్, స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సబ్సిడీపై మంజూరైన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను చెన్నేకొత్తపల్లిలో ఆదివారం రైతులకు ఆమె పంపిణీ చేశారు. ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్‌తో కలిసి పచ్చజెండా ఊపి సబ్సిడీ పరికరాలను తరలించే వాహనాలను ప్రారంభించారు. అనంతరం రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాలకు సంబంధించి 60మంది రైతులకు మంజూరైన డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ వ్యవసాయంలో నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టారన్నారు. దేశంలో మొట్టమొదటి సారిగా డ్రిప్‌ను తీసుకువచ్చి రైతులకు సబ్సిడీపై అందించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. గత వైసీపీ పాలనలో సబ్సిడీపై డ్రిప్, స్ప్రింకర్లు అందక రైతులు తీవ్ర ఇబ్బందులుపడ్డారన్నారు. ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని, ఆ దిశగా రైతులకు అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, రామగిరి, కనగాననల్లి, సీకేపల్లి మండలాల కన్వీనర్‌లు సుధాకర్, పోతలయ్య, ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, రామ్మూర్తినాయుడు, అంకేఅమరేంద్ర పాల్గొన్నారు.

దాహం తీరింది... కానీ..!

- గుత్తిలో తగ్గిన తాగునీటి ఎద్దడి
- గత సంవత్సరం నెల రోజులకోసారే నీరు
- నేడు 8-10 రోజులకోసారి..
- శాశ్వత పరిష్కారం ఎప్పుడో..?
- రూ. 173 కోట్ల ప్రాజెక్టుకు మోక్షం లభించేనా..?

7



గంట కొట్టి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్

భారీ స్కోరు దిశగా మహారాష్ట్ర

తొలిరోజు నాలుగు వికెట్ల నష్టానికి 284
కిరణ్ చోలామాలే భారీ సెంచరీ..
ఆంధ్రాతో కూచ్‌బెహర్ ట్రోఫీ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం ఆంధ్రా-మహారాష్ట్ర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్ బెల్ రింగ్ చేసి, బీసీసీఐ సెలెక్టర్ హర్విందర్‌సింగ్ సోఢీ, టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచిన మహారాష్ట్ర మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. 90 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 284 పరుగులు చేసింది. బ్యాటర్ కిరణ్ చోలామాలే 209 బంతుల్లో 19 బౌండరీలు, 6 సిక్సర్లతో 162 పరుగులు చేశారు. సుసృత్ సావంత్ 59, నీరజ్‌జోషి 25 పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్లు యువన్ 2 వికెట్లు పడగొట్టగా.. ఆదిత్యరెడ్డి, యశ్వంత్, రాజేష్ చెరో వికెట్ తీశారు. 31కి మొదటి వికెట్ కోల్పోగా, రెండో వికెట్ 80 పరుగుల వద్ద కోల్పోయింది. ఆ తరువాత 273 పరుగుల వరకు వికెట్ పడకుండా మహారాష్ట్ర బ్యాటర్లు కాపాడుకున్నారు. భారీ స్కోర్‌పై కన్నేసిన మహారాష్ట్ర జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి మహారాష్ట్ర 284-5గా నిలిచింది.



కిరణ్ చోలామాలే (162)

విశాలా ఫెర్రర్‌కు అవార్డు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సౌతిండియా ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్ ఎంపికయ్యారు. సీఈఓ రాధా ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూరులోని కేఈఏ ప్రభాత్ ఆడిటోరియంలో ఆమె అవార్డు అందుకున్నారు. మహిళల అభివృద్ధికి విశాలా ఫెర్రర్ ఆర్డీటీ ద్వారా చేస్తున్న కృషికి ఈ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



అవార్డు అందుకున్న తరువాత మాట్లాడుతున్న విశాలా ఫెర్రర్

దాహం తీరింది.. కానీ..!

గుత్తిలో తగ్గిన తాగునీటి ఎద్దడి

గత సంవత్సరం నెల రోజులకోసారే సరఫరా
నేడు 8-10 రోజులకోసారి..
శాశ్వత పరిష్కారం ఎప్పుడో..?
రూ. 173 కోట్ల ప్రాజెక్టుకు మోక్షం లభించేనా..?

నియోజకవర్గంలో రెండో మున్సిపాలిటీ అయిన గుత్తి పట్టణంలో భయంకరంగా ఉన్న తాగునీటి సమస్య కొంత తీరింది. గత ఏడాది ఇదే సమయానికి నెల రోజులకోసారి తాగునీరు సరఫరా అయ్యేది. గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయలేదని, తాను గెలిస్తే సమస్య పరిష్కారానికి కృషిచేస్తానంటూ గుమ్మనూరు జయరాం ఇచ్చిన ఎన్నికల హామీ ఆయన్ను గెలుపుతీరాలకు చేర్చింది. చెప్పిన విధంగానే ఎమ్మెల్యే అయ్యాక ఆయన గుత్తి సమస్యపై దృష్టిని సారించారు. నెలకోసారి తాగునీరు వచ్చే పరిస్థితి నుంచి ఎనిమిది, పది రోజులకోసారి నీరు వచ్చేలా మెరుగుపరిచారు. అయినా గుత్తిలో నీటి సమస్య పూర్తిగా దూరం కాలేదు.

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు/గుత్తి



గుత్తి చెరువులోకి చేరిన హంద్రీనీవా నీరు

వైసీపీ హయాంలో కటకట

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది. రూ. 173 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేసింది. పనులను కూడా మొదలు పెట్టింది. అంతలోనే ఎన్నికలు రావడంతో జగన్ ప్రభుత్వం గద్దెనెక్కింది. 2019 తర్వాత 2024 వరకూ గుత్తిలో తాగునీటి సమస్యను పక్కనపెట్టేశారు. ఫలితంగా గుత్తిలో గుక్కెడు నీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మిడ్‌పెన్నార్ ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. గుత్తి పురపాలక సంఘంలో 25 వార్డుల్లో 60 వేల జనాభా ఉంది. 6,571 కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. సత్యసాయి, వైటీసీ ప్రాజెక్టుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీరు 25 వార్డుల ప్రజలకు సరిపోవడం లేదు.



గుత్తి ఆర్ఎస్‌లో ఇంటర్ కనెక్షన్ చేసిన బోరు

కొంత ఉపశమనం

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో గుత్తి తాగునీటి సమస్యపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించింది. పట్టణంలోని కోట వీధిలో మూడు బోర్లు, బసినేపల్లి వంక వద్ద ఒక బోరు, పామిడిలో పెన్నా నది వద్ద ఒక బోరు వేసి కొత్త మోటార్లను బిగించారు. ఈ సీజన్‌లో గుత్తి చెరువుకు హంద్రీనీవా నీటిని అందించారు. ఫలితంగా చెరువు సమీపంలో ఎండిపోయిన బోర్లు రీచార్జి కావడంతో వాటిని వినియోగంలోకి తెచ్చారు. ఇలా రీచార్జయిన 11 బోర్లను రూ. 20 లక్షలతో ఇంటర్ కనెక్టివిటీని ఏర్పరచి వార్డులకు నీటిని అందజేస్తున్నారు. ఎప్పటికప్పుడు పైపు లైన్లు, చెడిపోయిన మోటార్లకు మరమ్మతులు చేయిస్తూ నీటి సరఫరాపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిని పెట్టారు. గతంలో నెలకు ఒకసారి కూడా ఏ నీరూ ఇవ్వలేని దుస్థితి నుంచి.. ఇప్పుడు 8-10 రోజులకు ఒకసారి మంచినీరు, మూడు రోజులకొకసారి ఉప్పునీటిని వదులుతున్నారు. వాటర్ ట్యాంకర్ల నిర్వాహకులతో చర్చించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చి, వార్డులకు తాగునీటిని సరఫరా చేయిస్తున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం



గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృత నిశ్చయంతో ఉన్నాం. సీఎం చంద్రబాబు నాయుడు కూడా గుత్తి తాగునీటి సమస్య పరిష్కారానికి స్పష్టమైన అభిప్రాయంతో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి ప్రణాళికను ప్రకటించే లోపే రాయలసీమ జిల్లాల్లో నీటి ఎద్దడిపై చర్యలు చేపట్టాలని సీఎంను కోరాను. కొత్త బోర్లు వెయ్యడం, మోటర్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రస్తుతం తాగునీటి ఎద్దడిని గణనీయంగా తగ్గించాం. వీలయినంత త్వరగా పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరిస్తాం. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటాం.

- గుమ్మనూరు జయరాం, గుంతకల్లు ఎమ్మెల్యే



నిలిచిపోయిన తాగునీటి ప్రాజెక్టు వద్ద సెల్ఫీ తీసుకుంటున్న చంద్రబాబు (ఫైల్)

చంద్రబాబు హామీతో ఆశలు

గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నిధులు రూ. 173 కోట్లు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయి ఉంటే ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేది. గత వైసీపీ ప్రభుత్వం అర్ధంతంగా వదిలివేయడంతో ఆ ప్రాజెక్టు మూలనపడింది. పట్టణ శివారులో ఏర్పాటు చేసిన మిడ్ పెన్నార్ ప్రాజెక్టులో 11 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, బీసీ కాలనీ, సూరశింగనపల్లి, చెర్లోపల్లిలో ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించారు. మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ నుంచి గుత్తి వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రచారంలో భాగంగా గుత్తికి వచ్చిన చంద్రబాబునాయుడు రూ. 173 కోట్లతో తన హయాంలో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టును పరిశీలించి సెల్ఫీ ఫొటో దిగారు. ఈ ప్రాజెక్టును వైసీపీ మూలన పడేసిన విషయాన్ని ప్రజలకు గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే జయరాం తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు



గుత్తి పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యపై యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నాం. గతంలో నెలకోసారి నీరు ఇచ్చేవారు. ఇప్పుడు 8-10 రోజులకు ఒకసారి నీరిస్తున్నాం. 11 చోట్ల బోర్లకు ఇంటర్ కనెక్షన్ ఇచ్చి వార్డులకు అందిస్తున్నాం. వేసవిలో సమస్య తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద రూ. 2 కోట్ల నిధులను కోరుతూ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం.

-జబ్బర్ మియా, మున్సిపల్ కమిషనర్, గుత్తి

సమస్య లేకుండా చేశారు



మా వార్డులో గతంలో నీరే వచ్చేది కాదు. తాగునీటి కోసం అవస్థలు పడ్డాం. ఇప్పుడు పది రోజులలోపు సత్యసాయి నీటిని ఇస్తున్నారు. సమస్య లేకుండా చేశారు. పది రోజులకు కాకుండా అంతరాన్ని మూడు రోజులకు తగ్గించాలి. ఎండాకాలం కూడా నీటి సమస్య తలెత్తకుండా చూడాలి.

-లక్ష్మీదేవి, 25వ వార్డు, గుత్తి

ఇప్పుడు ఎంతో మేలు

మా కాలనీలో తాగునీటికి తీవ్ర సమస్యగా ఉండేది. ఇప్పుడు నీరు వస్తోంది. గతంలో నెలకోసారి కూడా నీరు వచ్చేది కాదు. నీటి ట్యాంకర్ల కోసం వేచి చూసేవాళ్లం. ఇప్పుడు పది రోజులకు సత్యసాయి నీరు అందిస్తున్నారు. మూడు రోజులకు ఒకసారి బోర్లు నీళ్లు ఇస్తున్నారు. రోజు మార్చి రోజు నీరిస్తే బాగుంటుంది.



-లలిత, 6వ వార్డు, గుత్తి

జాబ్ మేళాకు అనూహ్య స్పందన

కష్టపడి పనిచేస్తే మంచి అవకాశాలు.. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అంబికా ఫౌండేషన్, అమర రాజా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి క్రాస్ వద్ద ఎంపీ కార్యాలయంలో అప్రెంటిషిప్ ట్రైనీ, మిషన్ ఆపరేటర్స్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 145 మంది హాజరయ్యారు. ఇందులో 98 మంది ఉద్యోగాల కోసం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కష్టపడి పనిచేస్తే భవిష్యత్‌లో మరిన్ని మంచి అవకాశాలు వస్తాయన్నారు. జాబ్ మేళా నిర్వహించి తమకు ఉద్యోగ అవకాశం కల్పించినందుకు ఎంపీకి నిరుద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమర రాజా కంపెనీ ప్రతినిధి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఆత్మహత్య

అప్పు తీసుకున్న వారు చెల్లించకపోవడంతోనే..!

కూడేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లో భాస్కర్‌బాబు (53) అనే ఉపాధ్యాయుడు ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు డి.హీరేహాళ్ మండలం మలికేతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న భాస్కర్ బాబు అనంతపురంలో నివాసముంటున్నాడు. బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన నరేష్‌కుమార్‌రెడ్డి, అనంతపురం పట్టణం హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న శ్రీనివాసులుకు ఈయన రూ.60 లక్షల వరకు డబ్బులు అప్పు ఇచ్చాడు. వారు తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకుల్లో ఈఎంఐలు ఎలా కట్టాలని మథన పడ్డాడు. ఈక్రమంలోనే తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయాడు. ఒత్తిడిని భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో కమ్మూరు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లోకి వెళ్లాడు. ఆత్మహత్య చేసుకునే ముందు నరేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసుల నుంచి రూ.60 లక్షలు ఇప్పించాలని పోలీసులను వేడుకుంటూ సూసైడ్ లెటర్ రాశాడు. తర్వాత పురుగుల మందు తాగి పడిపోయాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఉపాధ్యాయుడిని స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వచ్చి 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య కూడేరు మండలం హంసాపల్లి గ్రామంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు.

నేడు పంచాయతీరాజ్ చాంబర్ సమావేశం

అనంతపురం అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలోని జడ్పీ సమావేశపు హాలులో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్ ఆజాద్, ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గెనుగుంట్ల భూషణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేసి సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను సన్మానిస్తామన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి సంఘం నాయకులు, సర్పంచులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

టమోటా కిలో రూ. 23



అనంతపురం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 23తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 16, కనిష్ఠ ధర రూ. 10 పలికినట్లు ఆయన తెలిపారు.

631 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 631 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు ఔట్‌ఫ్లో కింద 162 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

అట్టహాసంగా ధన్వంతరీ ఆసుపత్రి ప్రారంభం

- మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతల హాజరు



ఆసుపత్రిలో వసతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

అనంతపురం టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు నెట్టెం వెంకటేష్ తనయుడు జనరల్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నెట్టెం శివకుమార్‌కు చెందిన ధన్వంతరీ ఆసుపత్రిని అట్టహాసంగా ప్రారంభించారు. ఆదివారం రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఈ నూతన హాస్పిటల్ ప్రారంభోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా పూజలతో నిర్వహించారు. ప్రారంభోత్సవానికి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ నాయకులు బాంబే డైయింగ్ నాగన్న, పూలకుంట నాగార్జున, గడ్డం సుబ్రహ్మణ్యం, సరిపూటి రమణ, రాయల్ మురళి, అపెక్స్ కన్‌స్ట్రక్షన్ అధినేత బోయ తిరుపాలు, నాయకులు, బంధువులు పెద్దఎత్తున తరలివచ్చారు. అతిథులు అక్కడ ఏర్పాటు చేసిన వసతులు, వైద్య పరికరాలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపి, మంచిగా వైద్యసేవలందించి మరింత మంచిపేరు తెచ్చుకోవాలని అతిథులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నేత నెట్టెం వెంకటేష్, ఆయన సతీమణి నెట్టెం లక్ష్మీదేవి, డాక్టర్ నెట్టెం శివకుమార్, ఆయన సతీమణి మానస, నెట్టెం శ్రీనివాస్, నెట్టెం సంగీతతోపాటు బంధుమిత్రులు పాల్గొన్నారు.

కోర్సు కొనసాగించాలి

అనంతపురం విద్య, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఆప్తాల్మిక్ కోర్సు కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు, కళాశాల విద్యార్థినులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక విద్యార్థులు కేఎస్ఆర్ కళాశాలలో చదువుతున్నారని తెలిపారు. ఇంటర్ బోర్డు మరిన్ని కోర్సులు ప్రారంభించాల్సింది పోయి.. ఉన్న కోర్సులను నిలిపివేసి కళాశాలలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఆప్తాల్మిక్ టెక్నీషియన్ కోర్సును రద్దు చేయడం కోసం పలుమార్లు బోర్డు నుంచి కళాశాల స్టాఫ్‌కు మౌఖిక ఆదేశాలిస్తూ...హెచ్చరికలు జారీ చేయడం సరికాదన్నారు. ఈ కోర్సులో ఇంటర్ మొదటి, రెండో సంవత్సరంలో 45 మంది చొప్పున విద్యార్థులు చదువుతున్నారన్నారు. చాలా మంది విద్యార్థులు గతంలో ఈ కోర్సు పూర్తి చేసి ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సోము, విజయ్, సాయి, ధనుష్, రాకేష్, కార్తీక్, హేమలత, దివ్యకళ, దీపిక, మమత తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో అనంతపురంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. 11.30 గంటలకు లలితకళా పరిషత్‌లో నిర్వహించే బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, ప్రభాకరరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. 2021లో తాడిపత్రిలో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించామని, అక్కడ తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించుకుంటామని తెలిపారు. రానున్న మూడు సంవత్సరాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ ప్రణాళికను ఈ మహాసభల్లో రూపొందిస్తామన్నారు. గతంలో జరిగిన దేశ, రాష్ట్రవ్యాప్త పిలుపులు, జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల, రైతు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, నిరుద్యోగ యువత, విద్యార్థి, సామాజిక సమస్యలపై, మహిళా సమస్యల పరిష్కారంకోసం ఎన్నో కార్యక్రమాలను సీపీఎం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలరంగయ్య, రామిరెడ్డి, రామాంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వదాన్య టాలెంట్ టెస్టుకు విశేష స్పందన



టాలెంట్ టెస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్



వదాన్య టీంతో డీఎస్పీ

కొత్తచెరువు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వదాన్య టాలెంట్ టెస్టుకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కొత్తచెరువులోని ఏడు పరీక్షా కేంద్రాల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు పెద్దఎత్తున రావడంతో పరీక్షా కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, కొత్తచెరువు సీఐ ఇందిరా పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా 9,10 తరగతుల విద్యార్థులు 3,400 మంది హాల్ టికెట్లు పొందగా 3,150 మంది హాజరయ్యారు. దీన్నిబట్టే ఈ టాలెంట్ టెస్టుకు ఎంత స్పందన ఉందో అర్థమవుతుందని డీఎస్పీ కొనియాడారు. విద్యార్థులు తమ మేధాశక్తిని పరీక్షించుకోవడానికి ఇలాంటి టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని 150 ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు తరలిరావడం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది పరీక్షలు నిర్వహిస్తున్న ఫౌండర్ అశోక్ పడపాటి, అతడి స్నేహితులను అభినందించారు. కార్యక్రమంలో వదాన్య సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ పరీక్షా ఫలితాలను జనవరి 10న విడుదల చేస్తామని సంస్థ నిర్వాహకులు అశోక్ తెలిపారు.

రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాలతోనే పోస్టు భర్తీ

- ఇన్‌చార్జ్ సీడీపీవో రాధమ్మ

ఆంధ్రజ్యోతికి స్పందన

కళ్యాణదుర్గం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పోస్టును రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకే భర్తీ చేస్తారని ఇన్‌చార్జ్ సీడీపీవో రాధమ్మ తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'హాట్ సీట్' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకే ఉద్యోగోన్నతులు, పోస్టుల భర్తీ చేశామని పేర్కొన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా అర్హతల మేరకే పోస్టులను భర్తీ చేశామని వివరించారు. సూపర్‌వైజర్లు అందరూ విధులకు సక్రమంగా హాజరవుతున్నారని అన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా సిబ్బంది తగిన సమయానికి విధులకు సక్రమంగా హాజరవుతున్నారని పేర్కొన్నారు.

సంక్షిప్తం

గాండ్ల సంక్షేమ సంఘంలో చోటు

● అనంత జిల్లా యువజన కన్వీనర్‌గా శ్రీనివాసులు

● శ్రీసత్యసాయి జిల్లాకు జగదీష్

అనంతపురం అర్బన్/చెన్నేకొత్తపల్లి, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): అఖిల గాండ్ల సంక్షేమ సంఘం జిల్లా యువజన కన్వీనర్‌గా అనంతపురం నగరానికి చెందిన పసల శ్రీనివాసులు, శ్రీసత్యసాయి జిల్లా యువజన కన్వీనర్‌గా పసల జగదీష్ నియమితులయ్యారు. నెల్లూరులో ఆదివారం ఏపీ అఖిల గాండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో శ్రీనివాసులు, జగదీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, జిల్లా నాయకులు వెంకటరాముడు, లక్ష్మీనారాయణ, పార్నపల్లి రామాంజనేయులు, నరసయ్య, రవి, గంగాధర్ శాలువా కప్పి, పూలమాల వేసి, వారిని ఘనంగా సన్మానించారు. గాండ్ల సక్షేమ సంఘం అభివృద్ధికి కృషిచేస్తామని వారు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వైబీ రాజేంద్రప్రసాద్‌తో కార్యదర్శులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు వైబీ రాజేంద్రప్రసాద్‌ను పలువురు కార్యదర్శులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రైవేట్ హోటల్లో కలిసి ఆనయకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు వర్ల శంకర్, వెంకటరాముడు, సుధాకర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, వెంకటరెడ్డి, జిల్లా సర్పచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగభూషణ్, డేగల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడకారుడికి ఆర్థికసాయం

అనంతపురం రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపల్లి పంచాయతీకి చెందిన అన్వర్ వలి అనే క్రీడకారుడికి మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ తన నివాసంలో ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అన్వర్ వలి నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఒడిషాలో జరిగే ఆల్ ఇండియా నేషనల్ అథ్లెటిక్స్ 200 మీటర్ల పరుగుపందెం పోటీలకు ఎంపికయ్యాడు. టీడీపీ నాయకులు బాబావలి, వన్నూర్‌స్వామి, రమేష్, షరీఫ్ పాల్గొన్నారు.

గన్‌మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

అనంతపురం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాలసునీత గన్‌మన్ రవికుమార్ ఆదివారం అనంతపురం నగరంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్వల్ప గాయాలకు గురై ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది, స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆయనింటికి వెళ్లి పరామర్శించారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ

గార్లదిన్నె, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇల్లూరులో బోయ శ్రీనివాసులు, రామాంజి, అల్లా అనే ముగ్గురు శనివారం రాత్రి హరిజన మణికంఠ ఇంటిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇంట్లో నిద్రిస్తున్న హరిజన మణికంఠ, భార్య స్వాతికి గాయాలలైనట్లు పోలీసులు తెలిపారు. బోయ శ్రీనివాసులు, రామాంజి, అల్లా ముగ్గురు సెల్ ఫోన్ విషయంలో హరిజన మణికంఠతో ఇటీవల గొడవపడ్డారు. శనివారం రాత్రి మణికంఠ దంపతులు ఇంట్లో నిద్రిస్తున్నారు. వారు ముగ్గురు ఐషర్ వాహనంతో ఇంటిని ఢీ కొట్టడంతో ఇంట్లో నిద్రిస్తున్న హరిజన మణికంఠ, స్వాతికి గాయాటయ్యాయి. ఇద్దరిని చికిత్స అనంతపురం ప్రభుతాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం అర్ధరాత్రి బోయ శ్రీనివాసులు, రామాంజి, అల్లాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదివారం ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌బాషాతో కలిసి ఇల్లూరుకు వెళ్లారు. దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. అనంతరం గ్రామంలో విచారించారు. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

అనుమానాస్పద మృతి

బుక్కరాయసముద్రం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక వంకలో బుక్కరాయసముద్రానికి చెందిన విజయ్(31) అనే వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. బుక్కరాయ సముద్రానికి చెందిన బోయ విజయ్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడు ఆదివారం సాయంత్రం 7గంటల సమయంలో ఎంపీడీఓ కార్యాలయం వెనుక చెరువు కింద ఉన్న వంక కాలువ వద్ద శవమై కనిపించాడు. అటు వైపు వెళ్లిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం రాత్రి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే అతడి మృతి పట్ల అనుమానం ఉందని బంధువులు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శరీరంపైన ఎక్కడా గాయాలులేవని తెలిపారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెలగని వీధి లైట్లు

40 రోజులుగా ఇబ్బందులు పడుతున్న పలు కాలనీల వాసులు



దూల్‌పేట కాలనీ, చైతన్య కాలనీలో వెలగని వీధిలైట్లు

నార్పల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప - ఊరు దిబ్బ అన్న చందంగా నార్పల మేజరు పంచాయతీ పరిస్థితి ఏర్పడింది. నార్పలలో కనీసం వీధి లైట్లు లేక రాత్రివేళల్లో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నార్పల మేజరు పంచాయతీలో 18 వార్డులుండగా, అందులో 1750 వీధిలైట్లు ఉన్నాయి. అయితే 40రోజులుగా దాదాపు 400కు పైగా వీధి లైట్లు చెడిపోయాయి. ఇప్పటి వరకు మరమ్మతులకు నోచుకోలేదు. మరికొన్ని చోట్ల కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో నార్పలలోని దూల్‌పేట కాలనీ, చైతన్య కాలనీ, ఊయలకుంట, మసీదుకట్ట, చౌడమ్మ కట్ట, చింతవనం కొట్టాల, తిక్కయ్యస్వామి వీధి, దారాబాయి కొట్టాల, గవ్వలవీధితో పాటు పలు కాలనీల్లో దాదాపు 400కు పైగా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో ఆయా కాలనీవాసులు రాత్రి అయితే చిమ్మచీకట్లోనే భయాందోళనలో జీవనం సాగిస్తున్నారు. ఇదే క్రమంలో రాత్రివేళ బయటకు వచ్చిన వారు పాములు, తేలు కాటుకు గురైన సంఘటనలు ఉన్నాయి. దూల్‌పేట కాలనీకి చెందిన వివేక్ అనే బాలుడు, చౌడమ్మ కట్ట వీధికి చెందిన కాటమయ్య అనేవ్యక్తి పాముకాటుకు గురయ్యారు. అయితే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. వీధిలైట్లు వెలగకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని 40 రోజులుగా ఎన్ని సార్లు అధికారులకు అర్జీలు ఇస్తున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆయా కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకేమీ సంబంధంలేదన్నట్లు పంచాయతీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళితే మేము ఏమి చేయాలి? త్వరలోనే వీధిలైట్ల న్లు వేయిస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆయా కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని త్వరలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ గంగావతిని వివరణ కోరగా... నార్పల మేజర్ పంచాయతీలోని పలు కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే వీధిలైట్లు వేయిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించండి

● ఎమ్మెల్యే పరిటాల సునీత

● ఆర్డీఎస్ పనుల పరిశీలన



నసనకోటలో జరుగుతున్న ఆర్డీఎస్ పనుల పరిశీలనకు వెళ్తున్న ఎమ్మెల్యే

రామగిరి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అవాంతరాలు లేకుండా వ్యవసాయానికి, గృహాలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ శాఖాధికారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. నసనకోట పంచాయతీలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్డీఎస్ స్కీం పనులను ఆమె ఆదివారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం, కేబుల్స్ మార్చి వేసి కండక్టర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చినట్టు వివరించారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని చెన్నేకొత్తపల్లి రామగిరి, కనగానపల్లి మండలాల్లో పనులు చేపట్టినట్టు వివరించారు. ముందుగా నసనకోట పంచాయతీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. నసనకోట పంచాయతీ తరహాలో నియోజకవర్గంలోని అన్నిప్రాంతాల్లో ఈ పనులు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ విధానంలా ఎలాంటి అవాంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయవచ్చని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా ఆపరేషన్ ఈఈ శివరాములు, కన్‌స్ట్రక్షన్ ఈఈ శ్రీధర్, ఏఈ నజీరుద్దీన్, రామగిరి ఎల్ఎం పరమేశ్వర పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్వర నీరాజనం



విజయరాఘవన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్‌బోర్డు ఘంటసాల మండపంలో ఆదివారం నిర్వహించిన స్వరనీరాజనం కార్యక్రమం వీక్షకులను ఆకట్టుకుంది. ప్రముఖ నేపథ్య గాయకుడు పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతి ఉత్సవాల ముగింపును ఘంటసాల సంగీత సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి స్పెషల్‌కోర్టు న్యాయాధికారి శివశంకర్, డీఆర్‌ఓ మలోల ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కళాకారులు ఘంటసాల పాటలను ఆలంచారు. అనంతరం ఘంటసాల ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందజేసిన విశ్రాంత రెవెన్యూ ఆఫీసర్ విజయరాఘవన్‌ను ముఖ్యఅతిథులు సత్కరించారు. అనంతలో ఘంటసాల కళామండపం ఏర్పాటుకు సంబంధించి ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని స్పెషల్‌కోర్టు న్యాయాధికారి శివశంకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు ఓబులదాస్, జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, జీవీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

'జిల్లా మహాసభలను విజయవంతం చేయండి'

అనంతపురం కల్చరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాయలసీమ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జనవరి 5న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని ఆ వేదిక నాయకుడు రాజశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. విభజన చట్టం ప్రకారం రాయలసీమకు ఇచ్చిన హామీల ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. అనంత జిల్లాను మరింత వెనుకబాటుకు గురిచేస్తున్నారని విమర్శించారు. మహాసభల్లో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, మహిళలు పాల్గొనాలని కోరారు.

ముగిసిన జాతీయస్థాయి ఎఫ్‌డీపీ

అనంతపురం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో వారంరోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ) ఆదివారం ముగిసింది. అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆతిథ్యం, అటల్ మిషన్ సహకారంతో కళాశాల హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఏఐ ఇంటిగ్రేటెడ్ నెక్స్ట్ జనరేషన్ సెమీ కండక్టర్ డివైసెస్‌పై కార్యక్రమం నిర్వహించారు. విదేశీ నిపుణులు, ఐఐటీ, ఎన్ఐటీ, ప్రతిష్టాత్మక విద్యాసంస్థలకు ప్రముఖ వ్యక్తులు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడం పట్ల విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ సంతోషం వ్యక్తం చేశారు. అందుకు కృషి చేసిన కోఆర్డినేటర్ చంద్రబాబు, కో-కోఆర్డినేటర్ కిరణ్ కుమార్‌రావు, నరసప్ప, ప్రోగ్రామ్ హోస్ట్ ఆనంద్‌ను అభినందించారు. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్డానా, ఏఓ మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ కార్యవర్గం ఎన్నిక

● అధ్యక్షుడిగా గంగన లక్ష్మిరెడ్డి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మూడో రోడ్డులోని షిర్డీసాయిబాబా ఆలయానికి సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆలయ ఆవరణలో ఆదివారం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వైకుంఠం జయచంద్ర చౌదరి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా గంగన లక్ష్మిరెడ్డి, ఉపాధ్యక్షులుగా గంగిరెడ్డి, శశిధర్, ప్రధాన కార్యదర్శిగా నాగేంద్రప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా రఘురామరావు, సహాయ కార్యదర్శులుగా సోమర జయచంద్రనాయుడు, మధుసూదన్, కోశాధికారిగా సతీష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

'ఖురాన్ పఠనంతో జీవితం సార్థకం'



ఆధ్యాత్మిక సందేశమిస్తున్న సయ్యద్ అమీర్ మసూది సాహెబ్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ముసిం పవిత్ర ఖురాన్‌ను పఠించి, అందులోని సారాంశాన్ని అర్థం చేసుకుని జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సయ్యద్ అమీర్ మసూది సాహెబ్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం సాయంత్రం తెహరీక్ ఫైజానే ఉమర్ ఫారుక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ వార్షిక సున్నీ ఇజ్‌తేమాకు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సయ్యద్ మసూది సాహెబ్ ముఖ్య అతిథిగా హాజరై ఆధ్యాత్మిక బోధనలు చేశారు.రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ముస్లింలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. తెహరీక్ ఫైజానే ఉమర్ ఫారుక్ సంస్థ ఆధ్వర్యంలో విందు అందజేశారు. కార్యక్రమంలో మధ్య ప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ ఖాదిర్, తెహరీక్ అధ్యక్షుడు హసన్ రాజా ఖాద్రీ, తౌషిఫ్ రజా, ముతవల్లి ఫరీదుద్దీన్, పర్వీష్, షబ్బీర్ అహ్మద్, హబీబ్, డాక్టర్ షఫీ, ఆరిఫ్, అబ్దుల్ సమీ, చాంద్‌బాషా, మహబూబ్‌బాషా, హుస్సేన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

అనంతపురం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ మల్లయ్య కొట్టాల్లో ఆదివారం నగరంలోని హర్షిత ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య కొట్టాల, అన్నేఫెర్రర్ కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేడు రూరల్ క్రికెట్ లీగ్ ఫైనల్స్

● తలపడనున్న ఏఎస్‌ఏ, ధర్మవరం బాలికల జట్లు

● నార్పల, ధర్మవరం బాలుర జట్లు



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఏజీఎం శివకుమార్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో నాలుగు జట్లు ఫైనల్స్‌కు చేరాయి. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బాలుర-15, బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. బాలికల పోటీల్లో ధర్మవరం, నార్పల జట్లు తలపడగా... నార్పల 23.3 ఓవర్లలో 101 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన ధర్మవరం 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 104 పరుగులు చేసింది. దీంతో ధర్మవరం 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో గుంతకల్లు, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడగా...ఏఎస్‌ఏ 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసింది. బ్యాటర్లు చైత్ర 73, హన్సిరెడ్డి 104 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన గుంత కల్లు 13 ఓవర్లలో 72 పరుగులకు ఆలౌట్ అయింది. ఏఎస్‌ఏ బౌలర్లు మాన్విత 5 వికెట్లు తీసి జట్టు 158 పరుగుల తేడాతో సాధించిన విజయంలో కీలకపాత్ర పోషించింది. బాలుర పోటీల్లో తపోవనం క్రికెట్ అకాడమీ, ధర్మవరం జట్లు తలపడగా... టీసీఏ జట్టు 34.5 ఓవర్లలో 120 పరు గులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ధర్మవరం 31 ఓవర్లలో 7 వికెట్లుకు 124 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్ లో నార్పల, రాప్తాడు జట్లు తలపడగా... నార్పల 39.1 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌట్ అయింది. వర్మ 48, కౌశిక్ 38, సంజయ్ 36పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన రాప్తాడు 10.5 ఓవర్లలో 28 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నార్పల 204 భారీ పరుగుల తేడాతో విజయం సాధించింది. బాలుర విభాగంలో ఫైనల్స్‌కు చేరిన నార్పల, ధర్మవరం, బాలికల విభాగంలోని అనంత స్పోర్ట్స్ అకాడమీ, ధర్మవరం జట్లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్ అభినందించారు. ఆ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇంచార్జి సెక్రటరీ బీమలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఈషా సంజన



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు జిల్లాకు చెందిన ఈషా సంజన ఎంపికైంది. ఈ నెల 20వ తేదీ నుంచి కాకినాడలో నిర్వహిస్తున్న ఏపీ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. టీం చాంపియన్ షిప్ విభాగంలో జిల్లాకు తృతీయ స్థానం దక్కింది. పాల్గొన్న జిల్లా క్రీడాకారిణులు ఈషా సంజన, హసిని, జ్ఞాపిక, సుభహానా అక్తర్, మనస్వినికి పతకాలు దక్కాయి. అత్యద్భుత ప్రతిభతో రాణించిన ఈషా సంజన జాతీయ స్థాయి అండర్-13, 15, 19బాలికల విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రతిభ చూపిన క్రీడాకారులను, కోచ్‌లు రవీంద్రనాథ్, వంశీకృష్ణను జిల్లా టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఎంవీ పాండురంగయ్య అభినందనలు తెలిపారు.

రాజ్యాంగంపై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు

● రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు హక్కులను కల్పించిన రాజ్యాంగంపై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు మరోసారి పార్లమెంట్ సాక్షిగా కేంద్రమంత్రి అమిత్‌షా ద్వారా బయటపడ్డాయని పలువురు వక్తలు మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై చేసిన చవకబారు మాటలకు కేంద్రహోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి అధ్యక్షతన వహించిన సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, మానవహక్కుల వేదిక జిల్లా అ ధ్యక్షుడు సుబ్బన్న, ఎమ్మార్పీఎస్ ఓబులేసు, ఫైట్‌ఫర్ రైట్స్ రాజు, పెద్దన్న, మాల మహానాడు ఓబులేసు ముఖ్య వక్తలుగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే దేశప్రధానిగా నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రిగా అమిత్‌షా ఉన్నారన్నారు. బీజేపీ అధి కారంలో దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరుగుతున్న దాడులు అమిత్‌సా వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కేంద్రమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పకపోతే ఉద్యమాలు తీవ్రతరమై బీజేపీ గద్దెదిగక తప్పదని హెచ్చరించారు. సమతా సైనిక్‌దళ్ శ్రీనివాసులు, వైసీపీ ఎస్సీసెల్ నరసింహులు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఏసన్న, జైభీమ్‌సేన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టకండి

● మార్కెట్‌లో భోజన వసతి కల్పిస్తాం: ఎమ్మెల్యే దగ్గుపాటి



మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు వచ్చే రైతులు, వ్యాపారులను ఇబ్బందులు పెట్ట వద్దని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఆయన ఆదివారం అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న పశువుల సంతను తనిఖీ చేశారు. అక్కడ వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. మార్కెట్‌లో సుంకం వసూలు, ఇతర సౌకర్యాల గురించి ఆరా తీశారు. మార్కెట్ ఫీజు వసూళ్లకు సంబంధించిన రసీదు బుక్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులు మాట్లాడుతూ... గతంలో సంతలో భోజనం పెట్టేవారని ఇప్పుడు లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. భోజన వసతి కల్పించాలని కోరారు. త్వరలోనే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే వారికి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి రైతులు, వ్యాపారులు వస్తుంటారని..వారిని ఇబ్బంది పెట్టవద్దన్నారు. మార్కెట్‌లో నిర్దేశించిన మేరకే సుంకం వసూలు చేయాలన్నారు. మార్కెట్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు గంగారామ్, రాయల్ మురళి, ఫిరోజ్ అహ్మద్, టీడీపీ నాయకులు రమేష్, హరి పాల్గొన్నారు.

నల్లమ్మ దేవతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజా సామగ్రి తీసుకెళ్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమడి నల్లమ్మ జాతర సందర్భంగా నల్లమ్మ దేవతకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కల్లుమడి గ్రామంలో మూడు రోజులుగా నల్లమ్మ జాతర జరుగుతోంది. చివరి రోజు ఆదివారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అమ్మ వారికి బియ్యం, బేడలు, చీర, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారికి మూగ జీవాలను బలి ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా నాయకులు సుధాకర్ యాదవ్, హెచ్ఎల్‌సీ దక్షిణ కాలువ ఉపాధ్యక్షుడు చంద్రాయుడు, ఓబిరెడ్డి, శశి, చిట్టి, రాజు, షాలిని, చింతబరి, ఈశ్వర్‌రెడ్డి, చిదానందనాయుడు కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం స్కూటర్ ర్యాలీ



స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైన స్కూటర్ ర్యాలీ శ్రీకంఠం సర్కిల్, సప్తగిరి సర్కిల్, పాతూరు, ఆర్టీసీ బస్టాండు మీదుగా నీలిమ సర్కిల్ వరకు కొనసాగింది. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, వెంకటనారాయణ, నాయకులు గోపాల్, ముత్తుజా, ప్రకాష్, మసూద్, ఓబులేసు, నాగరాజు, రాజు, బాబా, లతీఫ్, గఫూర్ పాల్గొన్నారు.

క్రీడలకు వయసుతో నిమిత్తం లేదు

● డీఎస్‌ఏ టోర్నీలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రీడలకు వయస్సుతో నిమిత్తం లేదని...క్రీడలతోనే శారీరక, మానసిక దృఢత్వాన్ని కలుగుతాయని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్ డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ఆదివారం ఇంటర్నల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడారు. అనంతరం గెలుపొందిన విజేతలకు ఫర్టిలైజర్ రామాంజినేయులు-షాషా జోడి మొదటి బహుమతి, రైఫర్ రవీంద్రారెడ్డి-టీచర్ శ్రీనివాస్‌బాబు జోడి ద్వితీయ, కాంట్రాక్టర్ హనుమంత రెడ్డి- జెడ్పీ బాబు జోడికి తృతీయ బహుమతులు అందజేశారు. అనూరాధ కన్‌స్ట్రక్షన్ ఎండీ ఆదినారాయణ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దిలీప్, డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వైకే శ్రీనివాసులు, పీవీకేకే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

అనంతపురం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి అనంత జిల్లా పశుసంవర్థక శాఖ అవుట్ సోర్సింగ్ హాస్పిటల్ అటెండర్స్ నూతన కార్యవర్గం ఎంపికైంది. స్థానిక సాయినగర్‌లోని వెటర్నరీ ఆస్పత్రిలో ఆదివారం ఆ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి అనంత జిల్లా అధ్యక్షుడిగా వరప్రసాద్, కార్యదర్శిగా రంగనాయకమ్మ, కోశాధికారిగా చంద్ర, ఉపాధ్యక్షులుగా బాబునాయుడు, ఆదినారాయణను ఎన్నుకున్నారు. అలాగే సహాయ కార్యదర్శిగా రామాంజినేయులు, ఈసీ సభ్యులుగా ఆదినారాయణ, వన్నప్ప, మల్లికార్జున, మూర్తి, రాజేశ్వరిని ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన పశుసంవర్థక శాఖ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పలు సూచనలు చేశారు.

అనంతను కలిసిన అనుబంధ సంఘాల నాయకులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ అనుబంధ సంఘాలకు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డిని కలిశారు. సమన్వయంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఆయన సూచించారు. యువజన విభాగం సాకే చంద్రశేఖర్, మహిళా విభాగం శ్రీదేవి, మైనార్టీ విభాగం సైఫుల్లా బేగ్, ఆర్టీఐ విభాగం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పేరుతో అడ్డగోలు రాజకీయాలు: బీజేపీ



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు రాజకీయాలు చేస్తోందని బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ ముఖ్య అతిథులుగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, కిరణ్‌కుమార్ గౌడ్, దుద్దకుంట వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో సమస్యల తిష్ట



అధ్వానంగా ఉన్న బాలికల మరుగుదొడ్డి



చెట్ల కింద విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

- 300 మంది విద్యార్థినులకు ఒకే మరుగుదొడ్డి
- తరగతి గదుల కొరతతో ఆరుబయట చదువులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

బొమ్మనహాళ్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో పలు సమస్యలు తిష్ట వేశాయి. ఆ కళాశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తరగతి గదులు సరిపడా లేకపోవడంతో పాటు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

ఈ జూనియర్ కళాశాలను 25 ఏళ్ల క్రితం ఆర్డీటీ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. సమీప గ్రామాల్లో 10వ తరగతి పూర్తి చేసిన నిరుపేద విద్యార్థులు ఈ జూనియర్ కళాశాలకే వస్తుంటారు. అయితే ఇక్కడ తాగునీటి వసతి లేదు. మధ్యాహ్న భోజనం తర్వాత క్యారియర్లు శుభ్రం చేసుకునేందుకు కూడా నీళ్లు లేవు. 300 మందికిపైగా విద్యార్థినులకు ఒకే మరుగుదొడ్డి ఉంది. వాటికి తలుపులు కూడా సక్రమంగా లేవు. నీటి సౌకర్యమూ లేదు. దీంతో విద్యార్థినులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక అబ్బాయిలకైతే మరుగుదొడ్డి ముచ్చటే లేదు. మలమూత్ర విసర్జనకు ఆరుబయటికి వెళ్లాల్సిందే. లెక్చరర్ కొరతతోనూ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సివిక్స్, బాటనీ, జువాలజీ, మ్యాథ్స్, కామర్స్ సబ్జెక్టులకు రెగ్యులర్ లెక్చరర్లు లేక కాంట్రాక్ట్ లెక్చరర్లను నియమించుకొని పాఠాలు చెప్పిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పొంతన లేకుండా నాడు-నేడు పనులను చేపట్టారు. కళాశాలకు రూ. 55.73 లక్షలు కేటాయించి రూ.26 లక్షలు మంజూరు చేసి మిగతా డబ్బును డెస్కులు, ఫ్యాన్లు, ఎలక్ట్రిక్ వస్తువుల కొనుగోలుకు ఉపయోంచారు. నాడు-నేడు కింద పనులు పొంతన లేకుండా చేశారని విమర్శలు వినవస్తున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం ఆగిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ప్రాంగణంలో చెట్ల కింద విద్యనభ్యసిస్తున్నారు. భోజనం చేసేందుకు సైతం వసతి లేకపోవడంతో తరగతి గదుల్లో, వరండాల్లో అపరిశుభ్ర వాతావరణంలో భోజనాలు చేయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వమైనా కళాశాలలో వసతులు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, లెక్చరర్లు కోరుతున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి



జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల కొరత కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. అధికారులు విద్యార్థినులకు ఇబ్బంది కలగకుండా మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో నిర్మించాలి. 300 మంది బాలికలకు ఒకే మరుగుదొడ్డి ఉండడం వల్ల ఇబ్బంది కలుగుతోంది. కళాశాలలో తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలి.

-లక్ష్మి, విద్యార్థిని

గదులు కొరత ఉంది



విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా కళాశాలలో తరగతి గదులు లేవు. గదుల కొరత కారణంగా సరిగా చదువుకోలేకపోతున్నాం. తరగతి గదులు మరిన్ని నిర్మించాలి. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం.

-దివ్య, ఇంటర్ విద్యార్థిని

మరో ఆరు గదులు అవసరం

కళాశాలలో ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు సంఖ్య బట్టి గదులు సరిపోవడం లేదు. మరో ఆరు గదులు అవసరమవుతాయి. మరుగుదొడ్ల సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తాగునీటి సమస్య ఇబ్బంది అయితే లేదు. కుళాయిలు మాత్రమే అవసరం.

- మోహన్‌కుమార్, ప్రిన్సిపాల్

క్లుప్తంగా..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

గుంతకల్లు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో 1981-84 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు గెట్‌టుగెదర్ నిర్వహించారు. బీకాం ఇంగ్లిషు మీడియంలో చదివిన విద్యార్థులు పట్టణంలో మళ్లీ ఇన్నేళ్లకు హౌసింగ్ బోర్డు కాలనీలోని వివేకానంద పార్కులో ఒక్కటిగా కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ అధ్యాపకులు రామస్వామి, గోపాలరావును పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పూర్వ విద్యార్థుల్లో సినిమా, సీరియల్స్ నటుడు అయిన నవభారత్ బాలాజీ (గ్యాంగ్‌లీడర్ సినిమా, గుప్పెడంత మనసు సీరియల్ ఫేం) కార్యక్రమానికి ఆకర్షణగా నిలిచారు. విశ్రాంత ప్రభుత్వోద్యోగి రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సీనియర్ జర్నలిస్టు గుత్తా ప్రభాకర నాయుడు, కుంజా సుబ్రహ్మణ్యం, కిషోర్, విజయ్, కళ్యాణి, నజ్మా, గోవిందకుమారి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను కమిషనర్ తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు వీరభద్రస్వామి, సీఐటీయూ మండల కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ పరిధిలో ఉండే సమస్యలను ఆయన పరిష్కరించడం లేదన్నారు. పదవీ విరమణ పొందిన ఆప్కాస్ కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ సెలవులు, డబ్బులను వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బట్టలు, చెప్పులు, కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వాలన్నారు. క్లాప్‌ఆటోడ్రైవర్లకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం పెద్దఎత్తున ధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు, మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘంఅధ్యక్షుడు కొండయ్య, నాయకులు చిన్నపెంచలయ్య, వెంకటేశులు, కసాపురం రమేష్, సూరి పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించరాదు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఆదివారంతో పాటు మిగతా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించరాదని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. స్థానిక భాగ్యనగర్‌లోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం తరగతులు జరుగుతుండగా.. ఆయన నాయకులతో కలిసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందితో మాట్లాడుతూ ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తే విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురౌవుతారని తెలిపారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల మేరకు స్పెషల్ క్లాస్‌లను చెబుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు దగ్గరకు వస్తున్నాయని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో దుస్తుల పంపిణీ

విడపనకల్లు(ఉరవకొండ), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా ఉరవకొండ పట్టణంలోని విఠల్ రుక్మిణి వృద్ధాశ్రమంలో వృద్ధులకు మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాల రామాంజనేయులు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉరవకొండ టౌన్ సీఐ మహానంది మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేయడం, భోజన ఏర్పాట్లు చేయటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రాజు, మల్లయ్య, ఓబయ్య, అంజీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఒంటి మిద్ది గ్రామం వద్ద ఆటోను, బొలెరో వాహనం ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రికి చెందిన వన్నూర్‌బీ, దస్తగిరెమ్మ, అబ్దుల్ నాజర్, నూర్జహాన్, షేక్షావలి, ఖాసింవలి మరి కొంతమందితో కలిసి ఆదివారం ఆటోలో బ్రహ్మసముద్రంకు పెళ్లి చూపుల కోసం బయలుదేరారు. ఆటో ఒంటిమిద్దికు రాగానే బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారితోపాటు రోడ్డు పక్కన నిలబడిన స్థానికులు ఓబుళపతి, చంద్రకు కూడా గాయాలయ్యాయి. వెంటనే వీరిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రూరల్ క్రికెట్ లీగ్ ఫైనల్స్

- తలపడనున్న ఏఎస్ఏ, ధర్మవరం బాలికల జట్లు
- నార్పల, ధర్మవరం బాలుర జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో నాలుగు జట్లు ఫైనల్స్‌కు చేరా యి. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బాలుర-15, బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. బాలికల పోటీల్లో ధర్మవరం, నార్పల జట్లు తలపడగా... నార్పల 23.3 ఓవర్లలో 101 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన ధర్మవరం 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 104 పరుగులు చేసింది. దీంతో ధర్మవరం 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో గుంతకల్లు, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడగా...ఏఎస్ఏ 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసింది. బ్యాటర్లు చైత్ర 73, హన్సిరెడ్డి 104 పరుగులు చేశారు. అనంతరం బరి లోకి దిగిన గుంత కల్లు 13 ఓవర్లలో 72 పరుగులకు ఆ లౌట్ అయింది. ఏఎస్ఏ బౌలర్లు మాన్సిత 5 వికెట్లు తీసి జట్టు 158 పరుగుల తేడాతో సాధించిన విజయంలో కీలకపాత్ర పోషించింది. బాలుర పోటీల్లో తపోవనం క్రికె ట్ అకాడమీ, ధర్మవరం జట్లు తలపడగా... టీసీఏ జట్టు 34.5 ఓవర్లలో 120 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ధర్మవరం 31 ఓవర్లలో 7 వికెట్లుకు 124 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్ లో నార్పల, రాప్తాడు జట్లు తలపడగా... నార్పల 39.1 ఓవర్ల లో 232 పరుగులకు ఆలౌట్ అయింది. వర్మ 48, కౌశిక్ 38, సంజయ్ 36పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన రాప్తాడు 10.5 ఓవర్లలో 28 పరుగులకు ఆలౌట్ అ యింది. దీంతో నార్పల 204 భారీ పరుగుల తేడాతో వి జయం సాధించింది. బాలుర విభాగంలో ఫైనల్స్‌కు చేరిన నార్పల, ధర్మవరం, బాలికల విభాగంలోని అనంత స్పోర్ట్స్ అకాడమీ, ధర్మవరం జట్లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



యాడికిలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుత్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్స్ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అదనపు కార్యదర్శి కుళ్లాయిబాబు, నాయకులు ఫకృద్దీన్, వెంకటసుబ్బమ్మ, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండలంలోని పలు పాఠశాలల్లో శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ గణితశాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ సేవలు ఎనలేనివన్నారు. చిన్నవయస్సులోనే గణితంలో అత్యంత ప్రతిభ చూపిన వ్యక్తి అని తెలిపారు. స్టార్ ప్యారడైజ్‌హైస్కూల్, వాగ్దేవిహైస్కూల్, విజన్ హైస్కూల్, వివేకానంద హైస్కూల్, శ్రీవిద్యహైస్కూల్, న్యూవికాస్ హైస్కూల్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలవ్యాప్తంగా సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా నడుస్తున్న విలువల బడుల్లో శ్రీనివాస రామానుజన్ జయంతిని జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

- విద్యార్థులకు డీఎస్పీ రవిబాబు సూచన

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని డీఎస్పీ రవిబాబు సూచించారు. పట్టణంలోని ఏఎఫ్ ఎకాలజీలో ఆదివారం కళ్యాణదుర్గం, కంబదూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రం, రాయదుర్గం సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ తరగతులను సాంఘిక సంక్షేమ అధికారి దామోదర్‌రెడ్డి నిర్వహించారు. డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టును కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, మెళకువలతో ప్రణాళికాబద్ధంగా చదివితే అధిక మార్కులు సాధించొచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీధర్, ఓబుళపతి, దేశం శ్రీనివాసరెడ్డి, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, హాస్టల్ వార్డెన్లు నాగరాజు, సురాంజనేయులు, జయలక్ష్మి, ఓబుళమ్మ, శ్రీనివాసులు, రామాంజుల రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి

బుక్కరాయసముద్రం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక వంకలో బుక్కరాయసముద్రా నికి చెందిన విజయ్(31) అనే వ్యక్తి అనుమా నస్పద స్థితిలో మృతి చెందాడు. బుక్కరాయ సముద్రానికి చెందిన బోయ విజయ్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడు ఆదివారం సాయంత్రం 7గంటల సమయంలో ఎంపీడీఓ కార్యాలయం వెనుక చెరువు కింద ఉన్న వంక కాలువ వద్ద శవ మై కనిపించాడు. ఆటు వైపు వెళ్లిన స్థాని కులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం రాత్రి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే అతడి మృతి పట్ల అనుమానం ఉం దని బంధువులు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శరీరంపైన ఎక్కడా గాయాలులేవని తెలిపారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన నరసింహులు ఆదివారం బైక్‌లో కళ్యాణదుర్గానికి వస్తుండగా మార్గంమధ్యలో అదుపుతప్పి బోల్తాపడ్డాడు. ఈ ఘటనలో నరసింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమి త్తం వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జయానాయక్ హెచ్చరించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణం, బీటీపీరోడ్డులో వాహనదారులకు ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. త్రిబుల్‌రైడింగ్, రాంగ్ పార్కింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఓవర్‌లోడ్‌తో ఆటోలలో ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరివేపాకు పంట పరిశీలన

పుట్లూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో రైతు భైరవేశ్వరకు చెందిన కరివేపాకు పంటను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు విషప్రయోగం చేశారని ఫిర్యాదు అందడంతో ఆదివారం పోలీసులు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హేమాద్రి తోటలోకి వెళ్లి పంటను పరిశీలించారు. ఏదో తెగులు లాగా ఉండడాన్ని గుర్తించి ఉద్యానవనశాఖ అధికారులకు పంపి నివేదికలు అనంతరం కేసు నమోదుచేస్తామని ఎస్ఐ తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తాడిపత్రి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు డీఎస్పీ రామకృష్ణుడు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ గతంలో చేసిన నేరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి నుంచి అయినా ప్రతి ఒక్కరూ మంచిగా నడచుకొని పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. వ్యవసాయం, వ్యాపారాలు చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. గొడవలు, అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లరాదని తెలిపారు. అలాంటి వాటిపై దృష్టి సారిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

కణేకల్లు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యం ఎస్‌డబ్ల్యూహెచ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న (45) గుండెపోటుతో మృతి చెందారు. వజ్రకరూరు మండలం గంజికుంట గ్రామానికి చెందిన సుధీర్ మాల్యంలో పనిచేస్తూ ప్రతిరోజూ వచ్చిపోతుండేవారు. శనివారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సుధీర్ మృతిపట్ల ఎంఈఓ లక్ష్మణ్ణ, ఎంఈఓ -2 భవానీశంకర్ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అలాగే మండల ఏపీటీఎఫ్ నాయకులు వెంకటేశులు, శివారెడ్డి, రామ్మోహన్‌గౌడ్, అస్లాంబాషా, గోపాల్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

యాడికి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు పోలీసులు తెలిపారు. పెద్దపప్పూరు మండలం నుంచి యాడికికి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే దాడులు చేసినట్లు చెప్పారు. ఇందులో రెండు ట్రాక్టర్లను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

హాకీ పోటీల్లో కళ్యాణదుర్గం క్రీడాకారుల సత్తా

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన హాకీ క్రీడా పోటీల్లో దుర్గం క్రీడాకారులు సత్తాచాటారు. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ ఫైనల్ అండర్-12 బాలుర విభాగంలో కళ్యాణదుర్గం హాకీ టీమ్ సభ్యులు మొదటి బహుమతి పొందారు. అండర్ 12 గర్ల్స్ విభాగంలో రెండో బహుమతిని సాధించారు. కార్యక్రమంలో గ్రీన్ కో సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుప్రసాద్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, అనంతపురం హాకీ జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అనిల్ కుమార్, ఆర్డీటీ హాకీ కోఆర్డినేటర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.



విజేత ట్రోఫీ అందుకుంటున్న కళ్యాణదుర్గం హాకీ జట్టు



ఉభయ జిల్లాల స్థాయిలో రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న కళ్యాణదుర్గం జట్టు

కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న జేసీ దంపతులు

తాడిపత్రి, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ మొదటిరోడ్డులో ఉన్న వేదమాత గాయత్రీదేవి, అమరలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో రూ.5కోట్ల వ్యయంతో చేపట్టనున్న కల్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి జేసీ ఉమారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జేసీపీఆర్ మాట్లాడుతూ దాదాపు 20రూములు ఉండేవిధంగా అత్యంత ఆధునికమైన కల్యాణమండపం నిర్మిస్తున్నామన్నారు. పట్టణంలో గాయత్రీదేవి ఆలయం అభివృద్ధితో పాటు కల్యాణ మండపం ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న ఉద్దేశంతో కొంత ప్రజల విరాళాలతో, కొంత సొంత నిధులతో ఈ కల్యాణ మండపం నిర్మాణాన్ని తలపెట్టినట్లు చెప్పారు. అంతకు మునుపు గాయత్రీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ.82వేల ఆర్థికసాయం



నగదును అందజేస్తున్న మిత్రబృందం

తాడిపత్రి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుంకులమ్మపాలెంకు చెందిన రాఘవేంద్ర కుటుంబ సభ్యులకు ఆదివారం ఆయన మిత్రబృందం రూ.82 వేలు ఆర్థికసాయం అందజేసింది. రాఘవేంద్ర ప్రైవేట్‌పాఠశాలలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకొనేవాడు. ఈ ఏడాది జూలైలో అనంతపురం వద్దనున్న వడియంపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అధ్యాపకుడు గురుమోహన్ ఆధ్వర్యంలో మిత్రులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, సురేష్, శంకర్, గురుప్రసాద్, శ్రీనాథ్‌గౌడ్, కోమలి శ్రీను, బాలగంగాధర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు కలిసి ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. రాఘవేంద్రకు భార్య వాసంతితో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పొంచివున్న ప్రమాదం



జుంజురంపల్లి ఎస్సీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

రాయదుర్గంరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభాలు ప్రస్తుతం ప్రమాదకర ంగా మారాయి. మండలంలోని జుంజురాంపల్లి ఎస్సీకాలనీలో, మైలార లింగేశ్వస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభాలు కడ్డీలు తేలి ప్రమాదకరంగా మారాయి. జెండా కట్ట వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభం కూడా పెచ్చులూడి కడ్డీలు దర్శనమిస్తున్నాయి. ఎప్పుడు కూలుతుందోనని కాలనీవాసులు భయపడుతున్నారు. గ్రామంలో మరి కొన్ని విద్యుత్ స్తంభాల పరిస్థితి అలాగే ఉంది. విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్య



సుశీలమ్మ(ఫైల్)

విడపనకల్లు డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కుంటనహాలు గ్రామానికి చెందిన పరుశురాముడు, లక్ష్మి దంపతుల కుమార్తె సుశీలమ్మను విడపనకల్లు మండల కేంద్రానికి చెందిన పెద్దన్నకు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం జరింపించారు. కాగా వివాహం జరిగిన రోజు నుంచి సుశీలమ్మకు తరచూ కడుపు నొప్పి వస్తోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి నొప్పి అధికం కావడంతో భరించలేక ఆమె ఇంట్లో పై కప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఉరవకొండకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు సుశీలమ్మ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయమై సుశీలమ్మ తండ్రి పరుశురాముడు ఇచ్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వర్గీయుల దాడి

బుక్కపట్నం, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలపై అదే ఊరికి చెందిన వైసీపీ వర్గీయులు ఆదివారం దాడిచేసి, తీవ్రంగా గాయపరిచారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజకీయ కక్ష పెంచుకున్న వైసీపీ కార్యకర్తలు తుంగ గంగాద్రి, యల్లప్ప, ఉత్తప్ప, సాయి, కుండ్ల కేశవ రెండ్రోజుల క్రితం తమ అంతు చూస్తామంటూ టీడీపీ కార్యకర్తలు రాము, గణపతి, చంద్రమోహన్‌ను ఫోన్‌లో బెదిరించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి బాధితులు ఆదివారం బుక్కపట్నం బయల్దేరారు. మార్గమధ్యలో బిద్రకుంటపల్లి వద్ద వైసీపీ వర్గీయులు దాడిచేసి, తీవ్రంగా గాయపరిచారు. దీనిపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న విదేశీ భక్తులు

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం సాయంత్రం విదేశీ భక్తులు సంగీత కచేరితో అలరించారు. విదేశీ భక్తురాలు అనాలువే బృందం సంగీతంతో మైమరపింపజేసింది. మొదట గౌరీపుత్ర వినాయకం పేరిట భక్తిగీతాన్ని ఆలపించారు. అనంతరం పాశ్చాత్య సంగీతాన్ని వినిపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

-ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి